క్లుప్తంగా

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: నిబంధనలను ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూర్ శాఖ నాయకులు డీఈవో దుర్గాప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు పాఠశాలలు విద్యా సంవత్సరం ప్రారంభంకాకముందే పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అదేవిధంగా అడ్మిషన్ ఫీజు పేరుతో 70 శాతం ఫీజును ముందే వసూలు చేస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కంఠేశ్వర్ జోనల్ ఇన్‌చార్జి సాయికుమార్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలకృష్ణ, ఇంద్రసేన, దుర్గాదాస్, ఉల్లెంగ ప్రణయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గంగాస్థాన్ ఫేస్–2 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్–2 ఏడీఈ తోట రాజశేఖర్ బుధవారం తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు అడ్డువస్తున్న 11కేవీ, ఎల్‌టీ లైన్లను పక్కకు మార్చనున్నామని, ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. గంగాస్థాన్ ఫేస్–2 ప్రాంతంలోని ఏడు అపార్ట్‌మెంట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్‌నగర్‌కు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న శ్రీరామకృష్ణ విద్యానికేతన్ స్కూల్ యాజమాన్యం 'పరివర్తన్– 2024' పేరుతో విద్యార్థులకు 25 రోజుల పాటు ఆయా అంశాల్లో వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. ధ్యానం, శ్లోకాలు, యోగా, భగవద్గీతలోని భక్తి, యోగం, శ్లోకాల పఠనం, డ్రాయింగ్, పాటలు, సెమీ క్లాసికల్ డ్యాన్స్, వేమన పద్యాలు, ఇంగ్లీష్ యాక్టివిటీస్, ఇంగ్లీష్ గ్రామర్ తదితర అంశాలను విద్యార్థులకు నేర్పించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల శ్రీనివాసాచారి, ప్రిన్సిపల్ మధుసూదనాచారి తెలిపారు. బుధవారం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వాహనకు సహకరించిన ఫ్యాకల్టీ టీచర్స్ ఎస్ఎన్ చారి, బుచ్చన్న, ఓం ప్రకాశ్, మధుసూదన్, మాధురి, చంద్రశేఖర్, ఈశ్వర్, శ్రీనివాసాచారి, శశిరేఖకు విద్యా సంస్థ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు

వర్ని: ఉపాధ్యాయ వృత్తి అన్ని వర్గాల వారికి మార్గదర్శకమని, ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పీఆర్టీయూ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా వర్నిలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి కమలాకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

నవీపేట: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో నాగనాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయలంలో బుధవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవనున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలను వేగవంతం చేయాలన్నారు. హరిత మొక్కల పెంపకంతోపాటు నర్సరీల్లోని మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

- హోటళ్ల నిర్వాహకులను హడలెత్తిస్తున్న మున్సిపల్ శానిటేషన్ అధికారులు
- మార్పు లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిక
- పలువురికి జరిమానాలు



నగరంలోని ఓ హోటల్ నిర్వాహకుడికి బుధవారం రోజున జరిమానా విధిస్తున్న శానిటేషన్ అధికారులు

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగంగా నగరంలోని హోటళ్లలో తనిఖీలతో హడలెత్తిస్తోంది. శుభ్రత లోపించడంతో ఇప్పటికే పలు హోటళ్లకు సంబంధిత అధికారులు జరిమానా విధించారు. మార్పు లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో సుమారు 100కు పైగా హోటళ్లు ఉన్నాయి. ఇందులో 80కిపైగా హోటళ్లలో కనీస నిబంధనలు పాటించడం లేదనేది బహిరంగ రహస్యమే! పర్యవేక్షించాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో హోటళ్ల నిర్వాహకులు శుచి, శుభ్రతను మరిచి డబ్బులు దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. హోటళ్లలో ఆహారం నాణ్యతపై సంబంధిత అధికారులకు పలవురు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎంహెచ్‌వోగా విధులు నిర్వర్తించిన సిరాజుద్దీన్ నిక్కచ్చిగా వ్యవహరించడంతో హోటళ్ల నిర్వాహకులు అప్పట్లో వణికిపోయారు. శుభ్రతపాటించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన టిఫిన్లు, భోజనం అందించారు. సదరు అధికారి పదవీ విరమణ పొందడంతో పరిస్థితి మొదటికి వచ్చిందని నగరవాసులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. నగరంలోని ఆరు జోన్ కార్యాలయాల పరిధిలో ఉన్న హోటళ్లలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాందేవాడ, గోల్‌హనుమాన్, పెద్దబజార్, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, కంఠేశ్వర్, అర్సపల్లి ప్రాంతాల పరిధిలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రభుదాస్, నటరాజ్‌గౌడ్, శ్రీకాంత్, ప్రశాంత్, సునీల్‌కుమార్, మహిపాల్‌తో కలిసి ఎంహెచ్‌వో హోటళ్లను తనిఖీ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం నగరంలోని 15 హోటళ్లలో తనిఖీలు చేసి సుమారు రూ.10 వేలకుపైగా ఫైన్‌లు వేశారు. తాజాగా బుధవారం 20హోటళ్లలో తనిఖీలు చేసి రూ.20వేల వరకు ఫైన్‌లు వేశారు. వారం రోజుల్లో తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు.

ప్రతిరోజూ తనిఖీలు

ప్రతినిత్యం నగరంలోని హోటళ్లలో తనిఖీలు చేపడతాం. ఇప్పటికే పలు హోటళ్లలో తనిఖీలు చేసి ఫైన్‌లు వేశాం. నిర్వాహకులు తీరు మార్చుకుని నిబంధలు పాటించాలి. వారం రోజుల్లో మార్పు రాకుంటే కఠినమైన చర్యలు తప్పవు.

– సాజిత్ అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో



నేటి చిత్రం..

తాగు నీటికి.. మురికి నీటికి తేడా ఏదీ?

నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటికి, మురికి నీటికి తేడా తెలియకుండా పోతోంది! మంచి నీటి కుళాయిల్లోకి మురికినీరు చేరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నగరంలోని కసాబ్‌గల్లీ ప్రాంతంలో ఇలా మంచినీటి కుళాయిలో మురికి నీరు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. అడుగున ఉన్న తాగునీటి పైప్‌లైన్ నుంచి ప్లాస్టిక్ పైప్‌తో నీటిని పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు కుళాయిలోకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలి

సుభాష్‌నగర్: ప్రభుత్వాలు, నూతన నాయకత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు సూచించారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో హమాలీ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన బాలరాజు, మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కార్మికులు కంకణబద్ధులై పని చేయాలన్నారు. ఏడాదికి 10 నెలలు నడిచే మార్కెట్‌యార్డులు రెండు నెలలు కూడా నడవకపోవడం శోచనీయమన్నారు. రైతులు మార్కెట్‌కు పంట దిగుబడులను తీసుకొచ్చేలా భరోసా కల్పించాలని, తద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తుందని, కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకుంటామని అన్నారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని, యార్డుకు చెడ్డ పేరు రాకుండా కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిశోర్ ఇనానీ, ప్రధానకార్యదర్శి మల్లేశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, పంచరెడ్డి శ్రీధర్, అధ్యక్షుడు ఎం పరశురాం, కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షుడు ఎన్ సుధాకర్, కోశాధికారి టి నరేశ్, నాయకులు కిషన్‌గౌడ్, వెంకట్, దడువాయి, గుమస్తా, చాట వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, అధికారులు

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోపాల్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి మంగళిపాడ్ నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రామేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. నారాయణ మాట్లాడుతూ.. అన్నిరకాల పంటలకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, ఎరువులు సరఫరా చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు 50శాతం సబ్సిడీపై ఇవ్వాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని, వడగళ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయాగౌడ్, నాయకులు దండు గంగమల్లు, గంగారాం, గంగాధర్, సాయిలు, రవి, పోచన్న పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



జక్రాన్‌పల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ రమేశ్‌రెడ్డిని కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా సహకార శాఖ కార్యాలయంలో రమేశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను మొదటి ప్రాధాన్యతగా మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. సీఎంతోపాటు స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

- హాజరైన గంగోత్రి రామానుజాదాసన్
- ఘనంగా ఏకోత్తర సహస్ర కలశాభిషేకం



ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న వేద పండితులు



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న గంగోత్రి రామానుజాదాసన్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని మహాలక్ష్మీనగర్‌లో లక్ష్మీనృసింహస్వామి తిరుకల్యాణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు చారుకొండ రుక్మిణి, నరహరి, వేద పండితులు నాని స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గంగోత్రి రామానుజాదాసన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో లక్ష్మీనృసింహస్వామి ఏకోత్తర సహస్ర కలశాభిషేకం, తిరుకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజాదాసన్ మాట్లాడుతూ.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు లక్ష్మీనృసింహస్వామి వారి తిరుకల్యాణం, సహస్ర కలశాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నూరే రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్, గంగాధర్, సందగిరి విక్రంరెడ్డి నరహరి, లవకుమార్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చక్రంగుడిలో..

నిజామాబాద్‌అర్బన్: లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవాన్ని నగరంలోని చక్రంగుడి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు కందాలై అగ్రీవాచార్య మంత్రాలు పఠించగా.. అర్చకులు అమిత్ కుమార్ ఆచార్య, అజిత్ కుమార్ ఆచార్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పండితులు కందాళై వినోద్‌కుమార్, గోవర్ధనం సందీప్‌కుమార్, గోపాలం విష్ణుకుమార్, భక్తులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికృప నగర్‌లో..

నగరంలోని షిర్డీ సాయి కృపానగర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, నిత్య హోమం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణ మహోత్సవ క్రతువులో పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు క్యాసారం రవీందర్‌రెడ్డి, రాజగోపాలం, కోశాధికారి డి.విష్ణువర్ధన్, ధర్మకర్తలు ఏ ఆనందరావు, కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ , అర్చకులు వెంకటేశ్‌శర్మ, కమిటీ సభ్యులు, డివిజన్ కులచారి సంతోష్ పటేల్, భూమేశ్, భాస్కర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నగరంలోని చక్రంగుడిలో..



వినాయక్‌నగర్ లక్ష్మీనృసింహుని ఆలయంలో..



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మినీ ఎత్తిపోతల పథకం పరిశీలన



మాక్లూర్: మండలంలోని ధర్మోరా చెరువులో గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకుని చేపట్టిన మినీ ఎత్తిపోతల పథకం పనులను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవారం పరిశీలించారు. రూ.11 కోట్ల 70 లక్షల వ్యయంతో బొంకన్‌పల్లి, ముల్లంగి (బి) గ్రామాల రైతులకు చెందిన 1100 ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా సంవత్సరకాలంగా పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పనులను జెడ్పీ చైర్మన్ పరిశీలించి సంబంధిత కాంట్రాకర్‌కు సూచనలు చేశారు. ఆయన వెంట జలంధర్‌రావు, పోశెట్టి, రైతులు ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,200	వెండి (కిలో)	93,000
22 క్యారెట్స్	68,450	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	75	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	40
బీర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	15	30	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు)-10.45, 1.30,4.40,7.20,10.20
- స్క్రీన్-2 ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)-10.45, 1.45,7.40,10.40; ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్-(ఇంగ్లీష్)-4.45
- స్క్రీన్-3 కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు)- 4.45,10.35; బాక్(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్(ఇంగ్లీష్)- 11.45,6.15,9.30; ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)-10.30
- స్క్రీన్-2 ది గార్‌ఫీల్డ్ మూవీ(ఇంగ్లీష్)- 2.30 8.05; కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లీష్)-4.55; ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)-10.30
- స్క్రీన్-3 కర్తం భుక్తం (హిందీ) - 1.10, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, 10.00
- స్క్రీన్-4 నటరత్నాలు(తెలుగు)-11.05; అపరిచితుడు(తెలుగు)-1.45; మిరల్(తెలుగు)-5.30, 10.30; అక్కడ వారు ఇక్కడ ఉన్నారు(తెలుగు)-8.05

గంగమ్మ తల్లికి జలాభిషేకం

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి)లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు బినోల నుంచి తీసుకొచ్చిన గంగ జలంతో బోర్గాం(పి) చౌరస్తాలో ఉన్న రామాలయం నుంచి గంగమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని గంగమ్మ తల్లిని ప్రార్థించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శేఖర్, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీనివాస్, నాయకులు జనార్దన్, గంగాధర్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



గంగాజలాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

బైరాపూర్‌లో పోచమ్మతల్లి జాతర



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

మోపాల్: మండలంలోని బైరాపూర్ గ్రామపరిధిలో పోచమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. కుస్తీ పోటీలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు ఆలయ కమిటీ, గ్రామ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. బడాపహాడ్ వద్దగల చిట్టాపూర్‌కు చెందిన మల్లయోధుడు ఉత్తమ ప్రతిభ కనబర్చి వెండి కడియం గెలుపొందారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రతాప్, వసంత్‌రావు, రాంనాథ్, రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.